## వెటర్నరీ డిగ్రీ కోర్సులకు దరఖాస్తులు

రామాయంపేట, జూన్1: అర్హులైన వారు వెటర్నరీ డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని డీఏవో రాజ్‌నారాయణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బీఎస్సీ వెటర్నరీ సైన్సులో డిగ్రీ కోర్సుకు సంబంధించి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఆచార్య జయశంకర్, కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన, పీవీ నరసింహారావు పశువైద్య విద్యాలయంలో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 28 లోపు దరఖాస్తు అందజేయాలన్నారు.

## టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులు విరమించుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 1: టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను కలెక్టర్ వెంటనే విరమించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, పీర్టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ, తపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలంటే తగినంత టీచర్లు ఉండాలని, ప్రభుత్వం జారీ చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రాజకీయంగా నీలకంఠ సమాజ సభ్యులు ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న లోక లక్ష్మీ రాజ్యం

పెద్దశంకరంపేట, జూన్1: నీలకంఠ సమాజ సభ్యులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ అఖిల భారతీయ నీలకంఠ సమాజం సంఘ అధ్యక్షుడు లోకలక్ష్మీ రాజ్యం అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నీలకంఠ సమాజం జనగణన చేపట్టాలని అందరూ ఒక్క తాటిపై ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. హైదరాబాద్‌లో నీలకంఠ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్రలోని సోలాపూర్, నాందేడ్, దుబ్బాక, సిద్దిపేట తదితర ప్రాంతాల నుంచి నీలకంఠ సమాజం సభ్యులు హాజరయ్యారు.

## ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం



ఆర్మీ జవాన్‌ను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

రామాయంపేట, జూన్ 1: ఆర్మీ జవాన్‌కు రామాయంపేట పద్మశాలీ భవన్‌లో సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం భాగిర్తిపల్లికి చెందిన విజయ్‌కుమార్, రామాయంపేట ఎస్సై బాలరాజు శాలువా కప్పి, స్వీట్లు తినిపించారు. జవాన్ విజయ్‌కుమార్ ఇటీవల యుద్ధ సమయంలో ఆపరేషన్ సిందూర్‌లో విధులు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మద్దెల రమేశ్, బల్ల రాజయ్య, యాదగిరి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.సత్యం, మోహన్, సుధాకర్, గజం యాదగిరి, రామచంద్రం, మ్యాకల సుధాకర్ తదితరులు ఉన్నారు.

## కూలిన భారీ వృక్షం



కూలిన భారీ వృక్షం, చెట్టు కింద ధాన్యం బస్తాలు

అల్లాదుర్గం, జూన్ 1: మండలంలోని కాయిదంపల్లి శివారులో ఆదివారం భారీ వృక్షం కూలింది. కాయిదంపల్లి– అల్లాదుర్గం ప్రధాన రహదారి (పాతరోడ్డు)పై రైతులు ధాన్యాన్ని ఆరబోసి కొనుగోలు కేంద్రానికి తరలిస్తుంటారు. ఎప్పటిలాగే ఆదివారం రైతులు ఆరబోసిన ధాన్యాన్ని బస్తాల్లో నింపుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో మర్రి చెట్టు కూలిపోయింది. ఇది పసిగట్టిన రైతులు అక్కడి నుంచి పరుగులు తీశారు. రోడ్డుపై ఉన్న ధాన్యం బస్తాలపై పడిన వృక్షంతో కొంతమేరకు ఆర్థిక నష్టం కలగింది.

## గురుకుల కార్యదర్శిపై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

నిజాంపేట, జూన్ 1: దళిత విద్యార్థులు పాష్ సొసైటీ నుంచి రాలేదని, వాళ్ల బాత్‌రూమ్‌లను వాళ్లే శుభ్రం చేసుకోవాలని అవమానపర్చిన రాష్ట్ర ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం నిజాంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంకర్ మాట్లాడారు. విద్యార్థులను కులం పేరుతో అవమానపర్చడం తగదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వర్షిణిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, మాజీ ఉపసర్పంచ్ కొమ్మాట బాబు, మండల అధ్యక్షుడు చంద్రం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నర్సాపూర్, జూన్ 1: మండలంలోని పెద్దచింతకుంట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ మే 25న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన మాజీ సర్పంచ్ శివకుమార్ ఇతరులు కలిసి బాధిత కుటుంబానికి రూ.23 వేల ఆర్థిక సాయం అందజేశారు. వీరితో పాటు మల్లేశ్‌గౌడ్, అంజయ్య పాల్గొన్నారు.

# జీలుగ విత్తనాలు ఎప్పుడొస్తాయో?

## చిలిపిచెడ్ రైతు వేదికలో ఏఈవోను నిలదీసిన రైతులు

చిలిపిచెడ్, జూన్ 1: చిలిపిచెడ్ మండలంలో జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు వానకాలం ప్రారంభానికి నెల ముందు జీలుగ, జనుము విత్తనాల అవసరం ఉంటాయి. రోహిణి కార్తె ప్రారంభమై వారం రోజులు అవుతున్నా ఇప్పటికీ రైతులకు జీలుగ, జనుము విత్తనాలు అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రైతులు ఎవరు లేరా.. ఎందుకు జీలుగ విత్తనాలు అందించడం లేదని రైతులు ఏఈవోను రైతు వేదికలో నిలదీశారు. ఏఈవో ఇంకా మూడు లేదా నాలుగు రోజుల్లో మండలానికి జీలుగు విత్తనాలు వస్తాయని సమాధానం ఇచ్చారు. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారులు స్పందించి చిలిపిచెడ్ మండలానికి జీలుగ, జనుము విత్తనాలు త్వరగా పంపించాలని అధికారులను కోరుతున్నారు.



చిలిపిచెడ్ రైతు వేదికలో ఏఈవోను జీలుగ విత్తనాల గురించి నిలదీస్తున్న రైతులు

### కేసీఆర్ హయాంలో జీలుగ బస్తాకు రూ.1150

కేసీఆర్ ప్రభుత్వం ఉన్నపుడు రోహిణి కార్తె కంటే నెల ముందు ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక రోహిణి కార్తె వచ్చి వారం రోజులు అవుతున్న ఇప్పటికీ జీలుగ, జనుము బస్తాలు రావడం లేదు. పక్కన ఉన్న సంగారెడ్డి జిల్లా, హత్నూర, సిరిపురం, జోగిపేట నుంచి జీలుగలు తెచ్చి పొలంలో చల్లాకుంటున్నాం. కేసీఆర్ ప్రభుత్వంలో 30 కేజీ జీలుగ బస్తాకు రూ.1150కు ఇచ్చేవారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను నిండా ముంచడానికి 30కేజీల జీలుగ బస్తాకు రూ.2150 ధరతో రైతులకు అమ్ముతున్నారు. రైతును రాజును చేస్తాన్న ప్రభుత్వం ఎందుకు ఇంత ధర పెట్టి జీలుగలు అమ్ముతున్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతులకు తక్కువ ధరకు అమ్మకాలు చేపట్టాలి.



- వీరస్వామి, రైతు, అజ్జమర్రి గ్రామం

# వారంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేస్తాం



కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు



కొల్చారంలోని కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కొల్చారం, జూన్ 1: వారం రోజుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 70 వేల 815 మంది రైతుల నుంచి రెండు లక్షల 95 వేల 703 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ.573 కోట్ల 60 లక్షలు రైతుల ఖాతాల్లో జమచేసినట్లు పేర్కొన్నారు. గత వానకాలం సన్న రకం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 12872 మంది రైతుల నుంచి 53659 మెట్రిక్ టన్నులకు రూ.26.83 కోట్ల బోనస్ చెల్లించామన్నారు. కలెక్టర్ వెంట కొల్చారం సీఈవో కృష్ణ, రైతులు ఉన్నారు.

### ఆవిర్భావ దినోత్సవానికి సర్వం సిద్ధం

మెదక్, జూన్ 1(నమస్తే తెలంగాణ): కలెక్టరేట్‌లో నిర్వహించనున్న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్, కలెక్టర్ ఏవో యూనస్, అధికారులతో కలిసి పరిశీలించారు. జెండా ఆవిష్కరణ, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రసంగం, శకటాల ప్రదర్శన, ప్రముఖులు, మీడియా, అతిథుల కోసం ఏర్పాటు చేసే సీటింగ్ గ్యాలరీ ప్రాంతాన్ని పర్యవేక్షించారు. డయాస్, అలంకరణ, మైక్ స్పీకర్‌పై పలు సూచనలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసు గౌరవ వందనం, బ్యాండ్, బందోబస్తుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేడుకలు అట్టహాసంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, పోలీసులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 1: భక్తులతో మెదక్ చర్చి కిటకిటలాడింది. ఏసయ్య నామస్మరణలతో హోరెత్తింది. మధ్యాహ్నం వరకు గంట గంటకు చేసిన ప్రార్థనల్లో భక్తులు పాల్గొని యేసయ్యకు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులనుద్దేశించి చర్చి ప్రెసిబేటరీ ఇంచార్జి రెవరెండ్ శాంతయ్య దైవ సందేశం చేశారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సువణ్ డగ్లస్, సంశాన్ సందీప్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించండి

రామాయంపేట, జూన్ 1: పట్టణంలోని కల్యాణ రామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కమిటీ విన్నవించింది. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ గృహానికి వెళ్లి కమిటీ కలిసింది. రామాయంపేట పాండు చెర్వు కట్టవద్ద ఉన్న కల్యాణ రామచంద్రస్వామి ఆలయానికి స్థలం తక్కువగా ఉన్నందున పక్కనే చెరువు కట్ట పొలాలకు ఆనుకుని ఉంది. ఇప్పటికే కట్టను కొద్దిపాటిగా వెడల్పు చేయడం జరిగింది. నిధులు లేనందున విస్తరణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, తమవంతు సహాయంగా ప్రభుత్వం ద్వారాగాని లేక స్వంతంగా నిధులు సమకూరిస్తే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ఎంపీకి తెలిపారు. దీంతో ఎంపీ సానుకూలంగా స్పందించి తనవంతు సాయం ఉంటుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో శంకర్‌గౌడ్, నక్క సిద్దిరాములు, స్వామిగౌడ్, గోపి తదితరులు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

వెల్దుర్తి, జూన్ 1: అనుమతులు లేకుండా హల్దీవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు అనుమతులు లేకుండా అక్రమంగా హల్దీవాగులో నుంచి ఇసుకను తరలిస్తున్నారన్నా సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్వాదీనం చేసుకున్న ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## అర్ధరాత్రి ట్రాక్టర్ చోరీ

నర్సాపూర్,జూన్1: నర్సాపూర్‌లో ఓ ట్రాక్టర్ చోరీకి గురైన ఘటన శనివారం రాత్రి జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్‌లోని శివాలయం కాలనీకి చెందిన ఎరుకల అశోక్ తన ట్రాక్టర్ (టీఎస్16ఈఆర్4981)ను రోజూ పనులకు తీసుకెళ్లి రాత్రి నిర్మాణ దశలో ఉన్న మార్కెట్ యార్డు ఎదుట పెట్టేవాడు. రోజు మాదిరిగానే శనివారం మార్కెట్ యార్డు ఎదుట ట్రాక్టర్‌ను పార్కింగ్ చేయగా, ఆదివారం ఉదయం చూసేసరికి అక్కడ ట్రాక్టర్ ఇంజిన్ కనిపించలేదు. చుట్టుపక్కల, తెలిసిన ప్రాంతాల్లో వెతకగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

## అనాథ పెళ్లి కూతురుకు దాతల అండ



ఆర్థిక సహాయం అందజేస్తున్న దాతలు

చిన్నశంకరంపేట, జూన్1: తల్లిదండ్రులు కోల్పోయి అనాథగా మారిన పెళ్లికూరుతుకు పలువురు దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందజేశారు. చిన్నశంకరంపేట మండలం టి.మాందాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము శిల్ప తల్లిదండ్రులు కోల్పోయింది. శిల్పకు పెళ్లీడు రావడంతో గ్రామస్తులు ముందుకొచ్చి ఆర్థికసాయం అందజేసి ఆదుకున్నారు. విషయం తెలుసుకున్న జాతీయ మానవ హక్కుల సంఘం మండలాధ్యక్షుడు దామోదర్ పెళ్లికి సరిపడా సరుకులు, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పుస్తెమట్టెలు అందజేశారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

### - మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

నిజాంపేట, జూన్1: బచ్చురాజుపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నరేందర్‌నాయక్ తండ్రి మంగ్యానాయక్ వారం రోజుల క్రితంమృతి చెందాడు. స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.



నరేందర్‌నాయక్‌ను పరామర్శిస్తున్న పద్మారెడ్డి

### మాజీ ఎమ్మెల్యేకు వివాహ ఆహ్వానం

నస్కల్‌కు చెందిన చంద్రకళ దుబ్బరాజయ్య దంపతుల కుమారుడు శ్రీకాంత్ వివాహానికి హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు.

### మెదక్ మండలం పాతూరులో..

మెదక్ రూరల్, జూన్1: మెదక్ మండలం పాతూరు బీఆర్ఎస్ నాయకుడు మైలి బాలయ్య, పార్టీ మండల అధ్యక్షుడు అంజా గౌడ్ తో కలిసి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని కలిసి తన కూతురు మహేశ్వరి వివాహానికి ఆహ్వానించారు.

# 9 ఉత్తమ సేవా పతకాలు సాధించిన పోలీసులు

మెదక్ అర్బన్, జూన్ 1: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీస్ అధికారులకు సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాకు చెందిన పోలీసులకు 9 పతకాలు వరించాయి. మహోన్నత సేవా పతకం అదనపు ఎస్పీ మహేందర్‌కు, ఉత్తమ సేవా పథకం ఏఆర్ఎస్సై యశ్వంత్ రావు, సేవ పతకాలు, యు.గాలయ్య ఎఎస్సై పాపన్నపేట పోలీస్‌స్టేషన్, కె.ఎన్ మూర్తి ఏఎస్సై మనోహరాబాద్ పోలీస్ స్టేషన్, హెచ్. మోహన్ ఏఆర్ఎస్సై, డీఏఆర్ మెదక్, జి.రాములు హెడ్‌కానిస్టేబుల్ డీఎస్‌బీ మెదక్, వైద్యనాథ్ ఎఆర్‌హెచ్‌సీ, డీఏఆర్ మెదక్, బస్వారాజ్ ఏఆర్ హెచ్‌సీ, డీఏఆర్ మెదక్, కె.రాజు కానిస్టేబుల్ చేగుంట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వారిని ప్రకటించారు.



అదనపు ఎస్పీ మహేందర్

# సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై అవగాహన



కొల్చారంలోని పోతిరెడ్డిపాడులో రైతులతో కలిసి పోస్టర్ ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు

కొల్చారం, జూన్ 1: వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి సేతాకుమారి ఆధ్వర్యంలో ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు రైతులకు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి, రంగంపేట్ గ్రామాల్లో పర్యటించి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మట్టి నమూనా సేకరణ విధానం, మట్టి పరీక్షలతో కలిగే లభాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటలో అధిక దిగుబడినిచ్చే రకాలైన వంగడాలను సాగు చేసుకోవాలని సూచించారు. వరి పంట ప్రధాన యాజమాన్య పద్ధతులు, కాండం తొలుచు పురుగు నివారణ పద్ధతులు వివరించారు. రసాయన ఎరువులతో పాటు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, జీవన ఎరువులైన పీఎస్‌బీ వాడుతూ అధిక దిగుబడి పొందవచ్చని వివరించారు. వరి సాగులో యంత్ర పరికరాల వినియోగంతో కలిగే లాభాలు వివరించారు. విత్తన కొనుగోళ్లలో పాటించాల్సిన మెళకువలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తునికి కృషి విజ్ఞన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డా.ప్రతాప్‌రెడ్డి, NGPBR శాస్త్రవేత్త డా. పి. ప్రణూష, IIRR శాస్త్రవేత్త డా.బసవరాజు రైతులు పాల్గొన్నారు.

### వరి సాగుపై రైతులకు అవగాహన

వెల్దుర్తి, జూన్ 1: వరి సాగులో సరైన విత్తనాలు నాటి, మెళకువలు పాటిస్తే అధిక దిగుబడిని పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్తలు ఉదయ్, ప్రసన్న, అప్పారావు రైతులకు సూచించారు. వికసిత కృషి సంకల్ప్ అభియాన్ పథకంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం తునికి, ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా మాసాయిపేట మండలంలోని అచ్చంపేట, పోతన్‌పల్లి గ్రామాల్లో రైతులకు వరి సాగు విధానం, యంత్రాల వినియోగం, మెళకువలపై అవగాహన కల్పించారు.

# రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

నిజాంపేట,జూన్1: మండలంలోని గ్రామాల్లో రేపటి నుంచి 12 వరకు నిర్వహించనున్న, భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. భూ సంబంధ సమస్యలు ఉంటే రైతులు రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

### రెవెన్యు సదస్సులను విజయవంతం చేయాలి



రామాయంపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ రజనీకుమారి

రామాయంపేట, జూన్ 1: రెవెన్యు సదస్సులను ప్రతి గ్రామంలో రైతులు విజయవంతం చేయాలని రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారి పేర్కొన్నారు. ఆదివారం కార్యాలయంలో రెవెన్యు సదస్సుల డాటాను విడుదల చేసి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 20వ తారీకు వరకు ప్రతి గ్రామంలో రెవెన్యు సమావేశాలు ఉంటాయన్నారు. భూభారతికి సబంధించిన అంశాలను రెవెన్యు సదస్సులో రైతులు తెలుపాలన్నారు. ఈ నెల 3న తొనిగండ్ల, 4న లక్ష్మాపూర్, 5న ఝాన్సీలింగాపూర్, సదాశివనగర్, 6న సుతారిపల్లి, శివ్వాయపల్లి, 9ప కోమటిపల్లి, 10న అక్కన్నపేట, 11న బా.ధర్మారం, 12న కోనాపూర్, 13న దామరచెర్వు, 16న దంతెపల్లి , 17న పర్వతాపూర్, 18న కాట్రియాల, 19న రాయిలాపూర్, 20న రామాయపేటలో రెవెన్యు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుల్లో రైతులకు సంబంధించిన భూ భారతి సమస్యలపై పరిష్కరించుకోవాలన్నారు.

## వనదుర్గ సన్నిధిలో భక్తుల సందడి



పూజలందుకుంటున్న అమ్మవారు క్యూ లైన్‌లో భక్తులు

పాపన్నపేట, జూన్1: వేసవి సెలవులు కావడంతో వనదుర్గా భవానీ మాత సన్నిధిలో ఆదివారం భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. దూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. వీరు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చన, తలనీలాలు, బోనాలు చెల్లించుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యాం, బ్రహ్మాచారి. బత్తిని రాజు, నర్సింహులు, వరుణాచారి, నరేఖ్, దీపక్‌త తదితరులు ఏర్పాట్లు చేయగా వేదపండితులు శంకర శర్మ,పార్థీవ శర్మ,రాము శర్మ,నాగరాజు శర్మ పాల్గొన్నారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టారు.

## ఘనంగా అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కౌడిపల్లి;జూన్01ః మండల కేంద్రమైన కౌడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000ల బ్యాచ్ పదవతరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళన సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు.తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను సాదరంగా వేదికపైకి ఆహ్వానించి వారికి పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించి పాదాబివందనం చేశారు.అప్పటి విద్యార్థులు అందరు ఒక్కచోటచేరి అప్పటిజ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తోటి మిత్రుల కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు.

## సైక్లింగ్‌లో విద్యార్థులను తీర్చిదిద్దుతా



సైక్లింగ్ రన్ ప్రారంభించిన జాతీయ క్రీడాకారుడు

రామాయంపేట, జూన్ 1: సైక్లింగ్‌లో విద్యార్థులను అద్భుతంగా తీర్చిదిద్దుతానని జాతీయ సైక్లింగ్ అవార్డు గ్రహీత, ఖేలో ఇండియా రామాయంపేట సెంటర్ కన్వీనర్ దండు యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం ఖేలో ఇండియాలో భాగంగా పట్టణంలోని మెదక్ చౌరస్తాలో సైక్లింగ్ రన్ ప్రారంభించారు. విద్యార్థులకు ప్రతి ఆదివారం ఉదయం 6 నుంచి 8గంటల పాటు సైక్లింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు. నేటి నుంచి ప్రతి ఆదివారం ఖేలో ఇండియాలో భాగంగా రామాయంపేటలో సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తానని జాతీయ ఆవార్డు గ్రహీత యాదగిరి తెలిపారు.

## కర్నాల్‌పల్లిలో ఉచిత వైద్యశిబిరం విజయవంతం

చేగుంట, జూన్1: కర్నాల్‌పల్లిలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంవి జయవంతమైందని లైన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం కర్నాల్‌పల్లిలో శ్రీలక్ష్మి డెంటల్, చిల్డ్రన్స్ దవాఖాన చేగుంట ఆధ్వర్యంలో చిన్నపిల్లలు, మహిళల ప్రత్యేక వైద్యనిపుణులు మౌనిక, దంతవైద్యుడు రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 200 మంది రోగులకు వైద్యపరీక్షలు చేశారు. చేగుంట లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సంజీవరెడ్డి, నర్సింహులు, మ్యాకల ఎల్లం ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE
670 Sq. Yards G+2 House For Sale:
Lavish Ground Floor with 10 Rooms for ideal Family living, Cars Parking place with 4 Borewells and Municipal Water connection, Lift place available. 1st Floor 4 Portions 2BHK Rented to 4 Tenants, 2nd Floor has 2BHK 9 Portions+Penthouse. Monthly Rental Income: Rs. 2,00,000 + Excellent investment opportunity.
9652533534, 7416724970

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్ధిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657